509) ముఖారి

ప॥ ఊరకే కలుగునా వున్నతపుమోక్షము । శ్రీరమణుకృపచేత జేరు మోక్షము ॥

**************************************************************************************



**************************************************************************************

చ॥ కలుషము బెడబాసి కర్మగండము గడచి । మలసినప్పుడుగా మరి మోక్షము ।
చలన మించుకలేక సంసారవారిధి దాటి । నిలిచినప్పుడుగా నిజమోక్షము ॥

చ॥ పంచేంద్రియాల మీరి భక్తిహరిమీద బెట్టి । మంచివాడైనప్పుడుగా మరి మోక్షము ।
అంచల యాసలు మాని ఆచార్యసేవ చేసి । మించినప్పుడుగా ఆమీదిమోక్షము ॥

చ॥ శాంతమే కూడుగా నుండి సమచిత్తమున బొంది । మంతుకెక్కినప్పుడుగా మరి మోక్షము ।
అంతట శ్రీవేంకటేశు డాదరించి మన్నించితే । నంతరంగమున నున్న దనాదిమోక్షము ॥